బాపూజీనగర్‌లో సమస్యల తిష్ఠ

- పలుచోట్ల దెబ్బతిన్న రోడ్లు
- లీకేజీలతో వృథాగా పోతున్న తాగునీరు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



బాపూజీనగర్ హైవే మెయిన్‌రోడ్డులో ప్రమాదకరంగా మారిన కల్వర్టు డ్రెయినేజీ



బాపూజీనగర్ నుంచి అంబేడ్కర్‌నగర్‌కు వెళ్లే మార్గంలో ధ్వంసమైన సీసీ రోడ్డు

కాజీపేట రూరల్ : పట్టణంలోని బాపూజీనగర్‌లో ప్రజలు వివిధ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. రోడ్లు, డ్రెయినేజీ, పైప్‌లైన్ లీకేజీల సమస్యలు ఉన్నప్పటికి మున్సిపల్ అధికారులు గానీ పాలకులు గానీ పట్టించుకోవడం లేదు. బాపూజీనగర్ నుంచి అంబేడ్కర్‌నగర్ ప్రాంతానికి వెళ్లే ప్రధాన మార్గాల్లో సీసీ రోడ్లు దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి. నిత్యం రాకపోకలు చేసే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హైవే మెయిన్‌రోడ్‌లో కల్వర్టు ప్రమాదకరంగా ఉంది. కల్వర్టు దెబ్బతిని డ్రెయినేజీ అస్తవ్యస్తంగా మారింది. హైవే రోడ్డుమార్గంలో వాహనాలు అదుపుతప్పి కల్వర్టు డ్రెయినేజీలో పడే ప్రమాదం ఉందని వాహనదారులు అంటున్నారు.

పైప్‌లైన్ లీకేజీలతో తాగునీరు వృథా

కడిపికొండ బ్రిడ్జికి ఎదురుగా అంబేడ్కర్‌నగర్‌కు వెళ్లే మార్గంలో మెయిన్‌రోడ్ సర్కిల్‌లో, కడిపికొండ బ్రిడ్జి వద్ద, బాపూజీనగర్ మెయిన్ రోడ్డు నుంచి బూడిదిగడ్డకు వెళ్లే మార్గంలో, డీజిల్‌కాలనీ మెయిన్ రోడ్‌లో బాలాజీనగర్‌కు వెళ్లే మార్గంలో మున్సిపల్ పైప్‌లైన్ లీకేజీలు కావడంతో ఈ ప్రాంతాల్లో తాగునీరు వృథాగా పోతుందని వాపోతున్నారు. పలు చోట్ల నెలకొన్న సమస్యలు పాలకులు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ అధికారులు పట్టించుకోవాలని ప్రాంతవాసులు కోరుతున్నారు.

ప్రమాదరహిత డ్రైవింగ్ చేయాలి

- ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి



డ్రైవర్‌ను సన్మానిస్తున్న ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి

హన్మకొండ: ప్రాణం విలువైందని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వాహనాలు నడిపి రోడ్ల ప్రమాదాలు నివారించాలని హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.సీతారెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండలోని వరంగల్–1 డిపోలో రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఆర్టీసీ బస్సు అంటేనే సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవచ్చనే నమ్మకం ప్రజల్లో ఉందన్నారు. ఆర్టీసీ డ్రైవర్లపై ఎంతో బాధ్యత ఉందన్నారు. ప్రమాదాల్లో ఆర్టీసీ ప్రమాదం శాతం తక్కువగా ఉందన్నారు. ఆధునిక పరిజ్ఞానంతో రోడ్లు నిర్మించుకున్న, వాహన వేగం పెంచుకున్నా గానీ మానవ తప్పిదాల వలన ఇలాంటి ప్రమాదాలు చాలా జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా ప్రమాదాలు చేయని డ్రైవర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్టీసీ వరంగల్ డిప్యూటీ ఆర్ఎం కేశరాజు భాను కిరణ్, డిపో మేనేజర్లు వంగల మోహన్‌రావు వెల్దండి జ్యోత్స్న, సూపర్ వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణం కల్పించాలి

ఆర్టీసీ డ్రైవర్ల కుటుంబాలు వారికి ప్రశాంత వాతావరణం కల్పించాలని ఆర్టీసీ వరంగల్–1 డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం డిపోలో ఫ్యామిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. విధులకు హాజరై వచ్చే ఆర్టీసీ డ్రైవర్లను కుటుంబ సభ్యుల విసిగించవద్దన్నారు. ప్రశాంతమైన మనసుతో డ్రైవింగ్ చేయడం ద్వారా ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చవచ్చన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సంతోష్, ఉద్యోగులు పాల్గొన్నారు.

‘ఆశ’లకు ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఆశ వర్కర్లు

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రమేశ్

హన్మకొండ అర్బన్ : ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశ కార్యకర్తలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భీమారం నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు నిర్వహించిన 10 కిలోమీటర్ల పాదయాత్రను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం రమేశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచిన మేనిఫెస్టోలో చెప్పిన విధంగా అమలు చేయాలన్నారు. సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి ఏడాదైనా కాలయాపన చేస్తున్నారు తప్పా ఏ ఒక్క సమస్యను పరిష్కరించలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఆఫీస్ బేరర్స్ బొట్ల చక్రపాణి, మెట్టు రవి, ఆశా యూనియన్ (సీఐటీయూ) నాయకులు పద్మ, యాకూబీ, రజిత, సూర్యకళ, సంధ్య, శోభ, పద్మ, శ్రీవాణి, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు జరిగే వార్డు సభలు

డివిజన్	ప్రాంతం
30	బాలసముద్రం, వాటర్ ట్యాంక్
4	యాదవ నగర్, కమ్యూనిటీ హాల్
49	రెవెన్యూ కాలనీ, కమ్యూనిటీ హాల్
53	లష్కర్ సింగారం, చర్చి
63	కాజీపేట, వాటర్ ట్యాంక్
45	కడిపికొండ, గ్రామపంచాయతీ
56	గోపాల్ పూర్, గ్రామ పంచాయతీ ఆఫీస్
కాశిబుగ్గ సర్కిల్ పరిధిలో..	
13	ఎల్‌బీనగర్, అంబేడ్కర్ భవన్ కమ్యూనిటీ హాల్
20	పద్మా నగర్, పద్మాక్షి భవన్
23	ఆటో నగర్, కమ్యూనిటీ హాల్
26	చౌరబౌళి, వాటర్ ట్యాంక్
32	ఎస్ఆర్ఆర్ తోట, కమ్యూనిటీ హాల్
34	శివనగర్, పద్మాశాలి ఫంక్షన్ హాల్
38	ముదిరాజ్ భవన్
41	నాగమయ్య టెంపుల్
29	పాపయ్యపేట, చమన్ కమ్యూనిటీ హాల్
43	మామునూరు, గ్రామ పంచాయతీ
17	బొల్లికుంట రైతు వేదిక

యుద్ధభేరి సభను విజయవంతం చేయాలి

- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

కేయూ క్యాంపస్: బీసీ విద్యార్థి యువతకు నష్టకలిగే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ రద్దుకు బీసీ గ్రాడ్యుయేట్స్ ఫోరం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2న హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్‌కళాశాల గ్రౌండ్‌లో జరిగే బీసీ యుద్ధభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం కేయూలోని క్రీడామైదానంలో, కామన్ మెస్‌లో ఆయన విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. బీసీ గ్రాడ్యుయేట్స్ ఫోరం ఆధ్వర్యంలో యుద్ధభేరి పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలు అన్నిరంగాల్లో వెనకబాటుకు గురవుతున్నారన్నారు. జనాభా ప్రాతిపదికన ఉన్నత వర్గాల్లో పేదవర్గాల పిల్లలకు మాత్రమే రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఓసీ అభ్యర్థికి 50 మార్కులు వచ్చినా కూడా ఈడబ్ల్యూఎస్ కింద ఉద్యోగం పొందుతుండగా 80 మార్కులు వచ్చినా బీసీ అభ్యర్థికి ఉద్యోగంలోనికి రాలేకపోతున్నారన్నారు. ఈడబ్ల్యూఎస్‌ను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశా రు. అనంతరం కేయూ కామన్‌మెస్‌ను సందర్శించారు. ఆయన వెంట బీసీ గ్రాడ్యుయేట్స్ ఫోరం ప్రతినిధులు, తెలంగాణ నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ డాక్టర్ మేడారపు సుధాకర్, తాళ్లపెల్లి నరేష్‌గౌడ్, బీసీ విద్యార్థి సంఘం నాయకులు ఎండీ. మహబూబ్‌పాషా, అభిరామ్, సుమన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

లెనిన్ ఆశయ సాధనకు కృషి



మడికొండ : లెనిన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

న్యూశాయంపేట/మడికొండ: లెనిన్ ఆశయ సాధన కోసం ప్రజా ఉద్యమాలు నిర్మిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి పిలుపునిచ్చారు. మంగళవారం బాలసముద్రం, మడికొండలోని రావి నారాయణరెడ్డి నగర్‌లోని పార్టీ కార్యాలయాల్లో లెనిన్ వర్ధంతి సభ జరిగింది. జిల్లా సమితి అధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. నాయకులు జ్యోతి, కరుణాకర్, ఎల్లేష్, భిక్షపతి, శ్రీనివాస్, రాజు, సారంగపాణి, మునిగాల భిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శి ఎల్లేష్, శంకర్, దీన, పద్మ, సత్యలక్ష్మి, కమల, పాల్గొన్నారు.

హోరాహోరీగా రైల్వే క్రికెట్ టోర్నమెంట్స్



టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న రైల్వే డీఎం

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే స్టేడియంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్స్ హోరాహోరీగా జరుగుతున్నాయి. మంగళవారం రైల్వే ఓబీసీ అసోసియేషన్ దక్షిణమధ్య రైల్వే జోనల్ ప్రెసిడెంట్ ఎ.సంతోష్‌కుమార్ మొదటి మ్యాచ్‌లో లోకో స్టార్ బెల్లంపల్లి జట్టు–ఆలేర్‌పివే జట్టుల మధ్య జరిగిన పోటీల్లో బెల్లంపల్లి జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో 11 బుల్లెట్స్ బీడీసీఆర్ జట్టు–సీఅండ్‌డబ్ల్యూ వారియర్స్ సికింద్రాబాద్ జట్టుల మధ్య పోటీని కాజీపేట డీజిల్‌షెడ్ రైల్వే డీఎంఈ అభిషేక్ అనికేత్ ఖడ్డే ప్రారంభించారు. అనంతరం 11 బుల్లెట్స్ బీడీసీఆర్ జట్టు–సీఅండ్‌డబ్ల్యూ వారియర్స్ సికింద్రాబాద్ జట్లు తలపడగా సికింద్రాబాద్ జట్టు విజయం సాధించింది. రైల్వే ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, జాయింట్ సెక్రటరీ రాజయ్య, కోశాధికారి జి.రాజేశ్వర్‌రావు, కల్చరల్ విభాగాల ఇన్‌చార్జ్ ధారవత్ రఘు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి



రామన్నపేట: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి జరుగుతుందని, ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఇందిరమ్మ రాజ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అమలు జరుగుతున్నాయని పలువురు వక్తలు అన్నారు. నగరంలోని పలు డివిజన్లలో ప్రభుత్వ పథకాల వివరాలను డివిజన్‌లో ప్రజలకు తెలియచేసి మీ అభిప్రాయాలను సేకరించడానికి వార్డు సభలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ప్రజాపాలనలో వీలుకాని అర్హులైన లబ్ధిదారులు, జాబితాలో పేర్లు రాని వారు మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



ఖిలావరంగల్: మాట్లాడుతున్న వరంగల్ ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి



వరంగల్ : గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్



హన్మకొండ: 51వ వార్డు సభలో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ రవీందర్ కుమార్

క్లుప్తంగా

సైబర్ మోసాలపై అవగాహన సదస్సు

ఎంజీఎం : సైబర్ మోసాలపై జిల్లా వైదరోగ్య శాఖ కార్యాలయంలో మంగళవారం వైద్యులకు, వైద్యసిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీఐసీఐ ఫౌండేషన్ రిసోర్స్ పర్సన్ రాజేంద్రప్రసాద్ ఏఏ రకాలుగా మోసం చేస్తున్నారు. వాటికి గురికాకుండా మనం ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై స్పష్టంగా వివరించారు.

దేశభక్తి గీతాలపై శిక్షణ

విద్యారణ్యపురి: భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు దేశభక్తి గీతాలు పాడేందుకు శిక్షణను ఈనెల 23, 24 తేదీల్లో హనుమకొండ ప్రభుత్వ డైట్‌లో ఇవ్వనున్నామని వల్లంపట్ల ఆర్ట్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రధాన కార్యదర్శి మ్యాకల సూరయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాలు తమ తమ పాఠశాలల నుంచి విద్యార్థులను ఈ శిక్షణకు పంపాలని కోరారు. ఆసక్తిగల వారు 94401 07543, 97057 58185 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఆర్థికసాయం



కాజీపేట : పట్టణంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఫొటోగ్రాఫర్ జేరిపోతుల రంజిత్ కుటుంబానికి మంగళవారం రూ.1.70 లక్షల ఆర్థిక యాన్ని అందజేశారు. రాష్ట్ర కుటుంబ భరోసాలో సభ్యుడిగా ఉన్న రంజిత్ కుటుంబానికి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జి.లింగమూర్తి, పట్టణ అధ్యక్షుడు జగదీశ్వర్ చెక్కును అందించారు.

కళాశాల ల్యాబ్ స్టోర్ కీపర్‌కు..



కేయూ క్యాంపస్ : హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ల్యాబ్ స్టోర్ కీపర్‌గా పనిచేస్తున్న నర్మెట్ట అయిలయ్య ఇటీవల మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులకు కళాశాలలోని అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది కలిసి రూ. 57వేల ఎల్ఐసీ బాండ్‌ను ఐలయ్య కుమార్తె శ్రీనిధి పేరుపై ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. బోధనేతర సంఘం బాధ్యులు రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

హ్యాక్‌థాన్‌లో కిట్స్ విజేత

హసన్‌పర్తి : ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ హైపర్ మోడ్ నాలెడ్జ్ గ్రాఫ్+ఏఓ చాలెంజ్ ఇంటర్నేషనల్ హ్యాక్‌థాన్ గ్రాడ్‌లో కిట్స్ విద్యార్థులు విజేతగా నిలిచారు. విద్యార్థులు యశ్వంత్ కృష్ణ, ఈషా బెల్లాడిలు (మూడు వేల యూఎస్ డాలర్లు) ప్రథమ బహుమతి సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి తెలిపారు. హ్యాక్‌థాన్‌లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందించారు. ప్రొఫెసర్ వేణుమాధవ్, ప్రొఫెసర్ శంకర్, డాక్టర్ రాజనరేందర్ రెడ్డి, ప్రభాకరాచారిలు పాల్గొన్నారు.


జాతీయ క్రికెట్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కాజీపేట: ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి టీ–10 క్రికెట్ పోటీల్లో స్థానిక తాళ్ల పద్మావతి ఒలింపియాడ్ పాఠశాల విద్యార్థులు మూడో స్థానాన్ని దక్కించుకున్నారు. తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న పాఠశాల క్రీడాకారులు చక్కటి ప్రతిభ పాటవాలను ప్రదర్శించారు. ఆయాన్ నాయక్, శివసాయిరెడ్డిలు ప్రత్యేక బహుమతులను గెల్చుకున్నారు. మంగళవారం క్రీడాకారులను తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం సన్మానించారు. పాఠశాల డైరెక్టర్లు తాళ్ల వంశీ, చైతన్యలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉర్దూ జర్నలిస్టుల క్రీడలు

న్యూశాయంపేట : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీయూడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో క్రీడలు కొనసాగుతున్నాయి. మంగళవారం మూడో రోజు ఇస్లామియా కళాశాల ఆవరణలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. కార్యక్రమంలో అధ్యక్షుడు సాజిద్ పాషా, కార్యదర్శి ఎంఏ నయీం, ఉపాధ్యక్షులు మున్వర్, మాషుక్, అక్తర్ హుస్సేన్, బాబర్, సమ్మద్, మోయిన్, జావిద్, పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



విద్యారణ్యపురి: తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం అసోసియేషన్ రూపొందించిన నూతన సంవత్సరం డైరీని, క్యాలెండర్‌ను హనుమకొండలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆవిష్కరించారు. సంఘం వరంగల్ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఎస్.రవీందర్, ఎల్ సుధాకర్‌రావు, బాధ్యులు మహేష్‌నాయక్, హెచ్ఎంలు ఎం.పట్టాభి, వి సదానందం, బి పరమేశ్వర్, ప్రద్యుమ్న, కృష్ణమూర్తి, దితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

26న సదస్సు

కేయూ క్యాంపస్ : రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 26న సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్‌లోని ఆబిడ్స్‌లోని సారస్వత పరిషత్‌లో తెలంగాణా జాగృతి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో గణతంత్రభారత్, జాగృతి భారత్ అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు తెలంగాణజాగృతి రాష్ట్ర నాయకులు దాస్యం విజయ్‌భాస్కర్ తెలి పారు. మంగళవారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

మోహన్‌రావుకు రోటరీ క్లబ్ ఎక్స్‌లెన్స్ అవార్డు

ఎంజీఎం : రోటరీ క్లబ్ వరంగల్ శాఖ 70వ వార్షికోత్సవం సందర్భంగా వైద్య రంగంలో విశేష సేవలందించిన ఎంజీఎం రిటైర్డ్ ఆర్ఎంఓ డాక్టర్ బందెల మోహన్‌రావుకు రోటరీ క్లబ్ ప్రతినిధులు ఎక్స్‌లెన్స్ అవార్డు అందించి సన్మానించారు.

మానసిక ఒత్తిడికి గురికావొద్దు

విద్యారణ్యపురి: విద్యార్థులు ఎలాంటి మానసిక ఒత్తిడికి గురికాకుండా పోటీ పరీక్షలకు ప్రిపేర్ కావాలని కష్టపడిచదివితే భవిష్యత్‌లో ఉన్నతస్థితిలోకి రాగలుగుతారని న్యూఢిల్లీ ఆస్మాన్ ఫౌండేషన్ సీనియర్ కౌన్సిలర్ ఎల్.నానాజీ అన్నారు. మంగళవారం హనుమకొండలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఆస్మాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థినీ విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ అండ్ సైక్రోమెట్రిక్ అసెస్మెంట్ అనే అంశంపై అవగాహన నిర్వహించారు.

క్యాట్ లెవల్–2 కు శ్రీచైతన్య విద్యార్థులు



వరంగల్: వరంగల్ కాశిబుగ్గ ఎల్‌బీ నగర్‌లోని శ్రీచైతన్య విద్యార్థులు క్యాట్(నాలెడ్జ్ అసెస్‌మెంట్ టెస్ట్) లెవల్ 2కు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బండారి కిరణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం అభినంద సభలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చైతన్య విద్యాసంస్థ ఎప్పటికప్పుడు వ్యక్తిగత శ్రద్ధ, జాతీయ పోటీ పరీక్షల్లో ప్రోత్సహించే విధానంలో ముందుంటుందన్నారు. ఈ పరీక్షల్లో 99 మంది రెండో లెవల్‌కు ఎంపికయ్యారని, వీరిలో ఏడుగురు విద్యార్థులు రూ.1000 నగదు గెలుచుకున్నారని తెలిపారు.

డాక్టరేట్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో వివిధ విభాగాల్లో పీహెచ్‌డీ పూర్తిచేసి డాక్టరేట్‌లు సాధించిన అభ్యర్థులు కేయూ డాక్టరేట్ అసోసియేషన్(కుడా)ను ఏర్పాటు చేసుకున్నారు. మంగళవారం కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ కొమురయ్య, వీరస్వామి, కృష్ణ, చైర్మన్‌గా ప్రేమ్ సుందర్ ఎన్నికయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ మధు, అధ్యక్షుడిగా డాక్టర్ అ నిల్, కన్వీనర్‌గా మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ‘చందర్‌రావు, జనరల్ సెక్రటరీగా రంజిత్ కుమార్, సెక్రట రీగా ఎల్.సురేష్, కోశాధికారిగా వెంకట్, సోషల్‌మీ డియా ఇన్‌చార్జ్‌గా శ్రవణ్, సంపత్‌కుమార్ ఎన్నికయ్యారు.

పార్కులో శాశ్వత పైప్‌లైన్ ఏర్పాటు

హన్మకొండ : హనుమకొండ శ్యామల దుర్గాదాస్ కాలనీలోని కమ్యూనిటీ పార్కులో శాశ్వత వాటర్ పైపులైన్ ఏర్పాటు చేశారు. పార్కులోని పచ్చని మొక్కలు, చెట్లు ఎండిపోతుండడంతో కాలనీ అభివృద్ధి కమిటీ స్పందించింది. ఈ పనులు మంగళవారం చేపట్టారు. 300 మీటర్ల పైపులైన్ నిర్మించారు. పార్కులోని అన్ని ప్రాంతాలకు నీటి రఫరా జరిగేలా గేట్‌వాల్వ్‌లు ఏర్పాటు చేశారు. కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడారు.

మిషన్ ఆస్పత్రి భూములను పరిరక్షించాలి

ఖిలా వరంగల్: అక్రమణకు గురైన బాప్టిస్టు చర్చి (మిషన్‌ఆస్పత్రికి) సంబంధించిన వెలువైన భూములను పరిరక్షించాలని తెలుగు బాప్టిస్టు చర్చిల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సురేందర్ బాబు కోరారు. మంగళవారం వరంగల్ 41వ డివిజన్ ఉర్సు ప్రతాప్‌నగర్‌లోని తెలుగు బాప్టిస్టు చర్చి(టీబీసీ) ప్రాంగణంలో మాట్లాడుతూ చర్చి కి సంబంధించిన ఆస్తులను కొందరు కబ్జాదారులు ఆక్రమించారన్నారు. ఉత్తర్వుల ప్రకారం అధికారులు స్పందించి ఆక్రమణదారుల చేతిలో ఉన్న భూములను స్వాధీన పర్చి మిషన్ ఆస్పత్రిని కాపాడాలని కోరారు.

ఎమ్మెల్సీని కలిసిన సంఘం నాయకులు

హన్మకొండ అర్బన్ : జిల్లా పర్యటనకు వచ్చిన ఎమ్మెల్సీ చింతపండు నవీన్ (తీన్మార్ మల్లన్న)ను మున్నూరుకాపు సంఘం నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్చాలు అందజేశారు. కలిసిన వారిలో సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కటకం పెంటయ్య, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కనుకుంట్ల రవికుమార్, ప్రధాన కార్యదర్శి పెరుకారి శ్రీధర్, కోశాధికారి పూజారి సత్యనారాయణ, నాయకులు నిమ్మల శ్రీనివాస్ ఉన్నారు.

ఆంగ్లభాషపై అభిరుచిని పెంచుకోవాలి

విద్యారణ్యపురి: ఆంగ్ల భాషపై విద్యార్థులు అభిరుచిని పెంచుకోవాలని వరంగల్ ఎల్‌బీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆరుణ డీహెచ్‌రావు కోరారు. మంగళవారం ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్టా) వరంగల్ ఆధ్వర్యంలో ఎల్‌బీ కళాశాలలో జిల్లాస్థాయిలో విద్యార్థులకు ఒలంపియాడ్, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఎల్టా రాష్ట్ర అధ్యక్షుడు టి వెంకటేశ్వర్‌రావు, అసోసియేట్ అధ్యక్షుడు పూల శ్రీనివాస్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి వంశీమోహన్, జిల్లా డీసీఈబీ సెక్రటరీ కృష్ణమూర్తి పాల్గొని మాట్లాడారు.

బెల్ట్‌షాపులో మద్యం పట్టివేత

కాజీపేట : 62వ డివిజన్ వైఎస్సార్‌నగర్ కాలనీలో మోడెం కౌశిక్ ఎటువంటి అనుమతులు లేకుండా తక్కువ ధరకు మద్యం సీసాలు కొనుగోలు తీసుకొచ్చి ఎక్కువ ధరకు విక్రయిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివకృష్ణ తెలిపారు. పక్కా సమాచారం మేరకు హెడ్‌కానిస్టేబుల్ మతిన్ పాషా బెల్ట్ దుకాణంలో సోదాలు చేయగా రూ.5,220ల విలువగల మద్యం లభించినట్లు తెలిపారు.

అక్రమ గుట్కా నిల్వల పట్టివేత

రామన్నపేట : వరంగల్ మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు రూ.1.39 లక్షల విలువ చేసే గుట్కా నిల్వలను పట్టుకున్నట్లు ఏసీపీ మధుసూదన్ తెలిపారు. డాల్ఫిన్ గల్లీలోని రాజ్‌పురోహిత్ నరేశ్ నుంచి రూ.1,08,900 విలు గల గుట్కా నిల్వలు, గుండా రాజ్‌కుమార్ నుంచి రూ.31,500 విలువ చేసే గుట్కా నిల్వలను స్వాధీనం చేసుకున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ : హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 22న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. ప్రకాష్‌రెడ్డి పేట, పోస్టల్‌కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, విద్యుత్ నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, కిషన్‌పుర, లష్కర్‌బజార్ ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, నయింనగర్‌లో మధ్యాహ్నం 1 గంట నుంచి 2 గంటల వరకు, కొత్తూరు, చర్చి ఏరియా, మార్కెట్ వెనుక వైపు, తోటబడి ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 10.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యార్థులకు స్టీల్ పాత్రల పంపిణీ

కాజీపేట రూరల్ : దర్గా ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జీయూపీఎస్, ఉర్దూ మీడియం పాఠశాలలో మంగళవారం గుంటూరు వాసి బోడపాటి సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యుల సహకారంతో మూడు పాఠశాలలకు కలిపి 201 మంది విద్యార్థులకు స్టీల్ ప్రాతలను ప్రతినిధి రామకృష్ణ పంపిణీ చేశారు.

పరీక్ష ప్యాడ్లు పంపిణీ

ఖిలా వరంగల్: వరంగల్ బొల్లికుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ సుబేదారి అధ్యక్షురాలు డాక్టర్ వీణావాణి ఆధ్వర్యంలో జిల్లా గ్యాట్ లీగల్ కో ఆర్డినేటర్ పుట్ట హరికిషన్ రెడ్డి సహకారంతో మంగళవారం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్,పెన్నులు పంపిణీ చేశారు.

కాళ్లను మొక్కించే సంస్కృతిని ఖండించండి

కాళోజీ సెంటర్ : రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో గత నెల 21న హెచ్ఎం రాములుపై మతం ముసుగులో మూకుమ్మడిగా దాడి చేసిన చర్యను ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి ప్రభాకర్ ఖండించారు. ఇలాంటి చర్యను సమాజం ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. మంగళవారం ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ సమావేశం వరంగల్‌లో జరిగింది. ప్రభాకర్ మాట్లాడుతూ అయ్యప్ప వేషధారణలో ఉన్న విద్యార్థికి హెచ్ఎం కాలు తాకిందనే అబద్ధ ప్రచారం చేసి విద్యార్థి కాళ్లు మొక్కించి వీడియో తీసి వైరల్ చేయడాన్ని, సభ్య సమాజం తీవ్రంగా ఖండించాలన్నారు.

ఆర్టిజన్‌లను రెగ్యులర్ ఉద్యోగులు గుర్తించాలి

హన్మకొండ: విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగులను రెగ్యులర్ ఉద్యోగులుగా కన్వర్షన్ చేయాలని తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రటరీ ముడిదే వెంకటేశ్వర్లు అన్నారు. పెద్దమ్మగడ్డలోని ట్రాన్స్‌కో జోనల్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం రెండో రోజుకు చేరుకున్నాయి. జిల్లా కన్వీనర్ వెంకటేష్ మాట్లాడుతూ విద్యార్హతను బట్టి ఆర్టిజన్‌లకు పదోన్నతి కల్పించాలన్నారు.

జూబ్లీమార్కెట్‌లో ఒంటరి వ్యక్తి మృతి

కాజీపేట: కుటుంబకలహాల నేపథ్యంలో కొంతకాలంగా భార్య బిడ్డలకు దూరంగా ఉంటున్న ఓ వ్యక్తి మంగళవారం తెల్లవారుజామున జూబ్లీ మార్కెట్ ఆవరణలో ఉన్న బస్టాండ్ వద్ద మృతి చెందినట్లు సీఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. కరీమాబాద్‌కు చెందిన వంగర రమేశ్ గతంలో కిరోసిన్ వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. వ్యాపారంలో నష్టాలు రావడంతో మద్యానికి బానిసగా మారడంతో ఇంట్లో గొడవలు మొదలయ్యాయి. దీంతో రమేష్ భార్య, ఇద్దరు పిల్లలను వదిలి కాజీపేటకు వచ్చి జీవిస్తున్నాడు. సోమవారం రాత్రి మద్యం సేవించి బస్టాండ్‌లో పడుకుని అలానే మృతి చెందాడు. భార్య ఉమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలి

హన్మకొండ: హసన్‌పర్తి ఎర్రగట్టు కల్యాణ మండపంలో ఈ నెల 25న జరుగనున్న రాజ్యాంగ పరిరక్షణ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ పరిరక్షణ రాష్ట్ర సదస్సు కరపత్రాలు విడుదల చేశారు.

నానో యూరియా, డీఏపీలతో అధిక లాభాలు

నయీంనగర్: పంట సాగుకు నానో యూరియా, డీఏపీల ఉత్పత్తులతో రైతులకు పంట దిగుబడులు అధికంగా ఉంటాయని ఇఫ్కో ఈ బజార్ సీఈఓ మధులిక శుక్లా అన్నారు. హనుమకొండ నయీంనగర్ ఫంక్షన్‌హాల్‌లో ఇఫ్కో రైతుల సహకార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు.